# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 15.02.2025 | 24 క్యారెట్లు 88,785.00 | కిలో వెండి 1,07,478.00 | 34 °C | సంపుటి:3 | సంచిక:116

www.vishalabharati.com






# మున్షీ ఔట్.. మీనాక్షి ఇన్

- తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులు
- రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మార్పు.. ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ
- దీపాదాస్‌మున్షీని మార్చాలంటూ కొన్నాళ్లుగా ఫిర్యాదులు
- పరిధి దాటి వ్యవహరించిన మున్షీ
- ప్రభుత్వ వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకుంటున్నట్లు ఆరోపణలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ కాంగ్రెస్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇంఛార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్ ను నియమించింది ఏఐసీసీ. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ టీమ్‌లో మీనాక్షి నటరాజన్‌కీలక సభ్యురాలిగా కొనసాగుతున్నారు. పార్టీలో ఎన్‌ఎస్‌యూఐ నుంచి ఆమె

..మిగతా 2 లో

## తెలంగాణలో జీవించే హక్కు లేదు

- కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. బలిసి కులగణలో పాల్గొనలేదు
- బీఆర్ఎస్‌లో ఉన్నోళ్లంతా గ్యాంబ్లర్సే
- నేను ఆఖరి రెడ్డి సీఎం అయినా ఓకే
- బీసీ కులాల లెక్కలు పక్కాగా తేల్చాం
- ప్రధాని మోడీ కన్వర్టెడ్ బీసీ
- 2022 వరకు ఆయనది ఉన్నత కులమే
- సీఎం అయ్యాకే మోడీ కులాన్ని బీసీల్లో చేర్చారు
- ఆయన కులం గురించి అన్నీ తెలుసుకునే మాట్లాడుతున్నా
- నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం
- మోడీపై యుద్ధం ప్రకటిస్తున్నాం
- బీసీలను మోసం చేసేందుకు అక్కడ మోడీ, ఇక్కడ కేడీ యత్నాలు
- గాంధీభవన్‌లో కులగణన ప్రజంటేషన్‌లో సీఎం రేవంత్



# కేసీఆర్‌పై సామాజిక బహిష్కరణ



“ కులగణనలో వివరాలు నమోదు చేసుకోకపోతే మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులకు సామాజిక బహిష్కరణ శిక్షే అని, వారి ఇంటి ముందు మేలుకొలుపు డప్పులు కొట్టాలని బీసీ సంఘాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. జనాభా లెక్కలు చెప్పని కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కు లేదని పేర్కొన్నారు. కులగణన సర్వే రెండో విడత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో ముఖ్యంత్రి ప్రసంగించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టంగా, శాస్త్రీయంగా కులగణన సర్వే చేయించామని, ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనిపై విపక్షం దుష్ప్రచారం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు కేటగిరీల కింద కులగణన సర్వే వివరాలు సేకరించామని, కులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతం ఉందని అన్నారు. కొందరు ఆరోపిస్తున్నట్టు కులగణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని, ఇప్పుడు కులగణన సర్వేను తప్పు పడితే బీసీలు శాశ్వతంగా నష్టపోతారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**కేసీఆర్ ఒక్క రోజు సర్వే మొత్తం కాకి లెక్కలే..**

ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ప్రభుత్వ సంక్షేమ పథకాలను యూత్ కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని

..మిగతా 2 లో



## 50కోట్ల మందికి పైగా భక్తుల పుణ్యస్నానాలు

- కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు
- ఫిబ్రవరి 14న ఒక్కరోజే 92 లక్షల మంది

2 లో



# టారిఫ్‌లపై తగ్గేదేలే..

## భారత్‌కు తేల్చిచెప్పిన ట్రంప్

- భారత్ ఎంత శాతం విధిస్తే మేమూ అంతే వేస్తాం
- 500బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం టార్గెట్
- త్వరలో భారత్, అమెరికా మధ్య పెద్ద ఒప్పందాలు
- భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు
- మోడీ, ట్రంప్ భేటీలో వెల్లడి

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

భారత్ సహా ఏ దేశంపైన అయినా పన్నుల విధింపు పెంపులో తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రధాని మోడీ ముందే తేల్చి చెప్పారు. మోడీతో భేటీకి ముందు అన్ని దేశాలతో పరస్పర సుంకాల అమలు ఫైల్ పై సంతకం చేసిన ట్రంప్ రెసిప్రోకల్స్ టారిఫ్స్ అంటూ వ్యాఖ్యానించి తన అంతరంగాన్ని చెప్పకనే చెప్పారు. అదే క్రమంలో వైట్ హౌస్ లో ప్రధాని మోడీతో ట్రంప్ భేటీ అనంతరం ఉమ్మడి మీడియా

..మిగతా 2 లో

# నీళ్ల కోసం మరో పోరాటం

- కేసీఆర్ ఆకాంక్ష నెరవేర్చుదాం
- కాంగ్రెస్‌హయాంలో సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు నిర్వీర్యం
- 14 నెలలైనా వాటివైపు తొంగి చూడలేదు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



2 లో



## రాహుల్ గాంధీది ఏ కులం.. ఏ మతం..?

- రాహుల్ తాత ఫిరోజ్ జహంగీర్ గాంధీ
- సీఎం రేవంత్ ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి
- 1994లో ప్రధాని మోడీ కులాన్ని ఓబీసీలో చేర్చారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

2 లో

# బీజేపీలో బీసీ చిచ్చు..!

## పార్టీలో బీసీలకు చోటెక్కడ..?

- ప్రెసిడెంట్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ రెడ్డి, మహిళా మోర్చా కూడా రెడ్డినే
- ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ట్వీట్
- పార్టీ వేధింపులు తట్టుకోలేకపోతున్నా
- బీజేపీ నుంచి పొమ్మంటే పోతానని సంచలన వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ బీజేపీలో బీసీ చిచ్చు రేగిందా..? ఆ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. బీజేపీలో బీసీలు ఎక్కడ..? ప్రెసిడెంట్ రెడ్డినే, ఫ్లోర్ లీడర్ రెడ్డినే.. మహిళా మోర్చా అధ్యక్షులు కూడా రెడ్డినే.. ఇక బీసీలకు చోటెక్కడుంది..? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ట్వీట్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా



..మిగతా 2 లో

# చికెన్ రేట్లు ఢమాల్..



తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ భయాందోళనను కలిగిస్తోంది. బర్డ్‌ఫ్లూ కారణంగా పెద్ద ఎత్తున కోళ్లు మృత్యువాత పడుతుండడంతో చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు. చికెన్ ధరలు భారీగా తగ్గినా.. భయంతో చాలా వరకు చికెన్ తినేందుకు ఇష్టపడడం లేదు. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో హైదరాబాద్ చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి.

- తెలుగు రాష్ట్రాలపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్
- నాలుగు రోజులుగా తగ్గిన అమ్మకాలు
- చికెన్ పేరెత్తితేనే జనాల్లో భయం భయం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో నిత్యం దాదాపుగా 6 లక్షల కిలోల చికెన్ సేల్ అవుతుంది. గత 2-3 రోజులుగా 50 శాతం కూడా సేల్స్ లేవని వ్యాపారులు అంటున్నారు. గిరాకీ లేక చికెన్ దుకాణాలు ఖాళీగా మారాయి. దానికి తోడు రోజూ నగరంలో అక్కడక్కడ కుళ్లిన చికెన్ నిల్వలు బయటపడుతున్నాయి. దాంతో చికెన్ ముట్టుకోవడానికి నగర వాసులు జంకుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లలో కూడా చికెన్ మెనూ ఆర్డర్లు పూర్తిగా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్‌కు బదులుగా.. మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మటన్, చేపలకు భారీగా గిరాకీ పెరిగింది.



## గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణను లీడర్‌గా నిలపాలి

- జర్మనీని బీటౌట్ చేయాలి
- గత పదేళ్లుగా సైంటిఫిక్ సాగుపై నిర్లక్ష్యం
- వ్యవసాయ శాఖ, నాబార్డు దీనిపై దృష్టి సారించాలి
- వ్యవసాయానికి విరివిగా రుణాలివ్వాలి
- డిజిటల్ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

2 లో

## 8 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు మాయం

- వరుస నష్టాల్లో స్టాక్ మార్కెట్లు
- ట్రంప్ టారిఫ్‌వార్‌తో కుదేలు
- 12 శాతం మేర పడిపోయిన మిడ్ , స్మాల్ క్యాప్‌లు

2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం, 15.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# నీళ్ల కోసం మరో పోరాటం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నీళ్ల కోసం మరో పోరాటానికి సిద్ధమవుదామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఆరాటపడిన కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదామని సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులకు, ప్రజలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో అనుసరించాల్సిన కార్యాచరణపై శుక్రవారం సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులతో కోకాపేట లోని తన నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ జైపాల్ రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు త్వరలో చేసే పోరాటం గురించి ఈ సమావేశంలో చర్చించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలనే డిమాండ్‌తో, ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. రెండేళ్ల క్రితం 2022 ఫిబ్రవరి 21న నారాయణ్ ఖేడ్‌లో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఆ ప్రాజెక్టుల వైపు తొంగి కూడా చూడలేదు. దీంతో సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్, ఆందోల్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల సాగునీరు కలగానే మారింది. దీంతో ప్రభుత్వంలో కదలిక తెచ్చి, ప్రాజెక్టులు పూర్తి చేయించి, దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై పోరాటానికి సిద్ధం అవుదామని పిలుపునిచ్చారు. ఆ దిశగా సంసిద్ధం కావాలని సూచించారు.

# రాహుల్ గాంధీది ఏ కులం.. ఏ మతం..?

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రధాని మోడీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు భగ్గమంటున్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రియాక్ట్ అయ్యారు. 42% బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మరో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని.. ఇందులో భాగంగానే సీఎం రేవంత్ ప్రధానమంత్రి కులంపై చర్చ మొదలు పెట్టారని ఫైర్ అయ్యారు. ప్రధాని మోడీపై సీఎం చేసిన పరిశోధన పూర్తిగా విఫలమైందని.. ఎందుకంటే 1994లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రధానమంత్రి మోడీ కులాన్ని ఓబీసీగా జాబితాలో చేర్చారని.. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోయారని ఎద్దేవా చేశారు. మోడీ కులంపై మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ కులానికి చెందినవారు..? అతని మతం ఏమిటి..? చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు ఆయన కులం మతం సీఎంకి కూడా తెలువదా అని అన్నారు. రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ జహంగీర్ గాంధీ అని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో కులం తండ్రి ద్వారా వస్తుందని తెలిపారు. ఎవరు చట్టపరంగా మతం మార్చుకున్నారో చర్చ చేయాలనుకుంటే జనపథ్ నుంచి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎంత ప్రయత్నించినా దృష్టి మళ్లించడం పనిచేయదని.. వాటన్నింటినీ అడ్డుకుంటామని బండి సంజయ్ హెచ్చరించారు.

# బీజేపీలో బీసీ చిచ్చు..!

తరువాయి భాగం సంచలనం సృష్టిస్తోంది. కులగణన సరిగ్గా జరగలేదని, అవన్నీ తప్పుడు లెక్కలని.. బీసీల సంఖ్యను తగ్గించారని ఓ వైపు బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తున్న సమయంలో రాజాసింగ్ వ్యాఖ్యలు బీజేపీని ఇరుకున పెడుతున్నాయి. రాజాసింగ్ ట్వీట్‌పై పార్టీ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన దానిని తొలగించారు.

**రాజీనామాకు రెడీ అయిన రాజాసింగ్..**

సొంత పార్టీలో వేధింపులు భరించలేకపోతున్నానని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఈ వీడియోలో సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో పార్టీలో చేరినప్పటి నుంచి వేధింపులు భరిస్తున్నానని చెప్పిన ఆయన ఇక భరించలేకపోతున్నాని.. పార్టీకి తాను అవసరం లేదు వెళ్లిపో అంటే వెళ్లేందుకు ఇప్పటికీ తాను సిద్ధంగా ఉన్నానంటూ సంచలన కామెంట్స్ చేశారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని ఎస్సీ లేకపోతే బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలని తాను సూచించగా, వారి పేర్లను పక్కనపెట్టి.. ఎంఐఎంతో తిరిగే వారికి ఇవ్వడం ఏంటని రాజాసింగ్ ప్రశ్నించారు. ఇదే విషయాన్ని పార్టీలోని ఓ కీలక నేతకు ఫోన్ చేసి అడిగితే ఆ ఎన్నిక విషయం తనకు తెలియదంటూ సమాధానమిచ్చారని అన్నారు. ఆయన చెప్పిన ఆ ఒక్క మాటతో తనపై దాగి ఉన్న కుట్ర కోణం బయటపడిందన్నారు. ఇప్పటివరకూ తాను బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో యుద్ధం చేశానని ఇప్పుడు సొంత పార్టీతో కూడా యుద్ధం చేయాల్సిన పరిస్థితి రావడం నిజంగా దురదృష్టకరమని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడి ఎన్నిక అనేది పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ సూచించిన వ్యక్తికి ఇవ్వాలని.. ఇది ప్రతి చోటా జరుగుతుందన్నారు. కానీ ఇక్కడ తాను సూచించిన వారి పేర్లను ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చిందో చెప్పాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. అంతేకాకుండా వెంటనే అధ్యక్షుడిని మార్చాలని కోరారు. వాస్తవానికి తెలంగాణలో బీజేపీ ఎప్పుడో అధికారంలోకి రావాలని కానీ రిటైరైన వ్యక్తులు పార్టీలో ఉంటే బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాదని రాజాసింగ్ అన్నారు.

# 50కోట్ల మందికి పైగా భక్తుల పుణ్యస్నానాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు భక్తజనం భారీగా పోటెత్తుతున్నారు. జనవరి 13న మహాకుంభ మేళా మొదలైనప్పటి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు త్రివేణీ సంగమంలో 50 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ విషయాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. "ఇది మానవ చరిత్రలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక తీర్థయాత్ర, సాంస్కృతికసామాజిక కార్యక్రమం. ఇప్పటికే 50 కోట్ల మందికిపైగా మహాకుంభ మేళాలో పుణ్యస్నానాలు చేశారు. భారత్, చైనాలు మినహా మిగతా దేశాల జనాభా కంటే ఈ సంఖ్యే ఎక్కువ. అమెరికా, రష్యా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాల జనాభా కూడా 50కోట్ల కంటే తక్కువే" అని యూపీ సర్కారు తెలిపింది. ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థానంలో శుక్రవారం (ఫిబ్రవరి 14న) ఒక్కరోజే 92 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారని పేర్కొంది.

**జనాభాపరంగా టాప్-10 దేశాల కంటే!**

"జనాభాపరంగా ప్రపంచంలోని టాప్10 దేశాల్లో భారత్ (141 కోట్లు), చైనా(140 కోట్లు), అమెరికా (34కోట్లు), ఇండోనేషియా (28 కోట్లు), పాకిస్థాన్ (25 కోట్లు), నైజీరియా (24 కోట్లు), బ్రెజిల్ (22 కోట్లు), బంగ్లాదేశ్ (17 కోట్లు), రష్యా (14 కోట్లు), మెక్సికో (13 కోట్లు) ఉన్నాయి" అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం గుర్తుచేసింది. ఫిబ్రవరి 26వరకు మహాకుంభ మేళా కొనసాగనుంది. అప్పటివరకు మరిన్ని కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఇందుకోసం యూపీ సర్కారు అన్ని రకాల ఏర్పాట్లు చేసింది.

## పీఏసీఎస్‌ల పదవీకాలం 6 నెలలు పొడిగింపు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 904 సహకార సంఘాల కాలపరిమితి, 9 డీసీసీబీ చైర్మన్ల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గ పదవీకాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 15 నాటికే గడువు ముగుస్తున్నా ఇంత వరకు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో సహకార సంఘాల పాలకవర్గ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# కేసీఆర్‌పై సామాజిక బహిష్కరణ

తరువాయి భాగం

సీఎం రేవంత్ అన్నారు. ఎన్నికల్లో డబ్బుతో ఎవరూ గెలవలేరని.. మేము ప్రజాభిమానంతో గెలిచామని తెలిపారు. డబ్బులే గెలిపిస్తాయంటే కేసీఆర్‌కు 100 సీట్లు వచ్చి ఉండేవన్నారు. కొడితే గట్టిగా కొడతామని కేసీఆర్ అంటున్నారని.. కేసీఆర్‌ను కొట్టాలంటే కేటీఆర్, కవిత, హరీశ్‌నే కొట్టాలన్నారు. కేసీఆర్‌ను కేటీఆర్ ఓడించారని.. కేజ్రీవాల్‌ను కవిత ఓడించిందన్నారు. కల్వకుంట్ల కుటుంబం అవినీతి చూసే ప్రజలు బుద్ధి చెప్పారని.. దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై పక్కాగా చేసిన మా లెక్కను తప్పంటారా... కేసీఆర్ ఒక్క రోజే సర్వే చేసి కాకిలెక్కలు చూపించారని విమర్శించారు. చెట్ల మీద విస్తరాకులు కుట్టినట్టుగా గతంలో సర్వే చేశారన్నారు. గ్యాంబ్లర్స్ అంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని.. కులాల లెక్కలు ఎప్పటికీ తేలకూడదనే ఆ పార్టీ నేతలు పన్నాగం పన్నుతున్నారన్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు తెలిసి, బలిసి సర్వేలో పాల్గొనలేదని... జనాభా లేకపోయినా రావులంతా పదవులు పంచుకున్నారన్నారు. బీసీలు ఆ లెక్కలు అడుగుతారనే అడ్డుకుంటున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన నా కోసం కాదు.. క్రమశిక్షణ కలిగిన సీఎంగా కులగణన చేయించామన్నారు. దొంగ లెక్కలు చెప్పాలనుకుంటే మా కులాన్ని ఎక్కువ చూపించేవాళ్లమని.. బీసీ కులగణనకు రెండో విడత కూడా అవకాశం ఇచ్చామన్నారు.

**మోడీ అసలు కులం బీసీ కాదు..**

ప్రధాని మోడీపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ బీసీ కాదని.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని హాట్ కామెంట్స్ చేశారు. మోడీ పుట్టుకతో బీసీ కాదని.. ఆయన సీఎం అయ్యాక మోడీ కులాన్ని బీసీలో కలిపారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మోడీ కులం గురించి ఆషామాషీగా చెప్పడం లేదని.. అన్ని తెలుసుకునే ఆయన కులం గురించి మాట్లాడుతున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణన నివేదికను తప్పు అంటూ మోడీ, కేడీ బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. సర్టిఫికేట్స్‌లో మోడీ బీసీ కానీ.. ఆయన మనసు అంత బీసీ వ్యతిరేకి అని విమర్శించారు. దేశం మొత్తం కూడా కులగణన సర్వే జరగాలని పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీని రాహుల్‌గాంధీ నిలదీశారని, ఈ సర్వే జరగకూడదని మోదీ, కేసీఆర్ కలిసి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కులగణన జరిగితే చట్ట ప్రకారం రిజర్వేషన్లు సాధించుకోవచ్చని వెల్లడించారు. అధికారిక లెక్కలు ఉంటే బీసీల రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు కూడా చెప్పొచ్చని పేర్కొన్నారు. జనాభా లెక్కలు జరిగేటప్పుడు కేంద్ర ప్రభుత్వం కులగణన కూడా చేయాలని కోరారు.

**తెలంగాణకు నిధులివ్వాలని మోడీపై యుద్ధం**

తెలంగాణకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పై యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జక్కిడి శివచరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఏం పాపం చేసిందని నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు నిర్మాణానికి నిధులు కేటాయించడం లేదని ఇందుకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి రూపాయి ఇస్తే.. మనకు 42 పైసలు ఇస్తుందని. బీహార్ రూపాయి ఇస్తే.. 7 రూపాయలు ఇస్తున్నారు. యూపీ రూపాయి ఇస్తే.. 3 రూపాయలు ఇస్తున్నారని వెల్లడించారు. త్వరలోనే కార్యచరణ రూపొందిస్తామని.. అవసరం అయితే మోడీ పై యుద్ధం చేస్తామని చెప్పారు. తెలంగాణ పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



**చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారు..**

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అగ్ర రాజకీయ నేతలంతా యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని రేవంత్ రెడ్డి చెప్పారు. హనుమంతరావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్‌లో పని చేశారని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా అక్కడ్నుంచే వచ్చారని పేర్కొన్నారు. రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ అనేది మొదటిమెట్టని ఆయన చెప్పుకొచ్చారు. పదవులు వచ్చినా, రాకపోయినా కాంగ్రెస్ శ్రేణులు మాత్రం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల్లో యూత్ కాంగ్రెస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని.. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు ఇస్తామన్నారు. ఫ్లెక్సీలు కట్టి దండాలు పెట్టేవారికి పదవులు రావని.. ఢిల్లీ నుంచి కాదు.. గల్లీ నుంచి వచ్చిన వారికే పదవులు ఇస్తామన్నారు.

# మున్షీ ఔట్.. మీనాక్షి ఇన్

తరువాయి భాగం

కొనసాగుతున్నారు. పార్టీ, ప్రజాప్రతినిధిగా అనేక పదవులు ఆమె నిర్వర్తించారు. మధ్యప్రదేశ్‌లో ఇండోర్ ప్రాంతానికి చెందిన మీనాక్షి నటరాజన్ 2009 నుండి 2014 వరకు మాండ్సౌర్ నుంచి లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగారు. ఆమె 1999-2002 వరకు ఎన్ఎస్‌యూఐ అధ్యక్షురాలిగా పనిచేశారు. మీనాక్షి 20022005 వరకు మధ్యప్రదేశ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. ప్రస్తుతానికి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జిగా ఉన్న దీపాదాస్‌మున్షీ స్థానంలో మీనాక్షి నియమించబడ్డారు.

**దీపాదాస్‌ను తొలగించాలని ఫిర్యాదులు..**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ 2023 డిసెంబర్ 23న బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఆమె ఇంచార్జిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆమె తన పరిధి దాటి వ్యవహరించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. పార్టీ వ్యవహారాలే కాకుండా ఇక్కడి కీలక అధికారులకు ఆమె నేరుగా ఫోన్లు చేయడం, పలు నిర్ణయాలు తీసుకునే విధంగా ఒత్తిడి చేయడం, మంత్రుల శాఖ పరమైన విషయాల్లో జోక్యం చేసుకోవడం, నామినెటెడ్ పోస్టుల్లోనూ ఆమె అతి జోక్యంపై పార్టీ కీలక నాయకులందరు ఆమెపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెను తెలంగాణ నుంచి మార్చాలంటూ కొన్నాళ్లుగా పార్టీ పెద్దలకు నేరుగానే ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గత కొన్నాళ్లుగా ఆమెను మారుస్తారు, కొత్త వారు ఇంఛార్జిగా నియమితులు కానున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఎట్టకేలకు పార్టీ అధిష్ఠానం ఆమెను మార్చింది. వచ్చే ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి మున్షీ పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా నియమించినట్లు తెలిసింది.

# టారిఫ్‌లపై తగ్గేదేలే..

తరువాయి భాగం

సమావేశంలో విలేఖర్ల ప్రశ్నలకు వారు బదులిచ్చారు. ఈ సందర్భంగా భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను ట్రంప్ సమర్థించుకొన్నారు. భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్ లు వేస్తామని.. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే చార్జి చేస్తామని.. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదని స్పష్టం చేశారు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్ ల ఊరట కోసం ప్రయత్నించి ఆశించిన ఫలితం పొందలేదని... అందుకే ఇతర దేశాలు ఎంత పన్ను వేస్తే.. మేము అంతే ఛార్జి చేస్తామని... అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య అని ట్రంప్ స్పష్టం చేశారు. పన్నుల వ్యవహారంలో మాకు ఐరోపా అత్యంత సమస్యాత్మకమని.. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో మాపై పన్నులు విధిస్తున్నారని ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు.

**భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు**

అమెరికాభారత్ కోసం అద్భుతమైన వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నామని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'తర్వలోనే ఓ భారీ ఒప్పందాన్ని ప్రకటిస్తాం. అమెరికాలో ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్‌ను భారత్ మరింతగా కొనుగోలు చేస్తుంది. ఈ ఏడాది నుంచి భారత్‌కు మిలిటరీ ఉత్పత్తులు విక్రయాలను పెంచుతాం. ఎఫ్35 స్టెల్త్ ఫైటర్ జెట్లను కూడా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం తర్వలోనే జరుగుతుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. అమెరికాలో చమురు, గ్యాస్ వాణిజ్యంపైనా దృష్టిపెడతాం. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యమే మా లక్ష్యమని తెలిపారు.

# గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణను లీడర్‌గా నిలపాలి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటి. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 15.02 లక్షల కోట్లు, వృద్ధిరేటు 14.5%. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం 3.56 లక్షలుగా ఉంది' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 'అభివృద్ధి అనేది కేవలం సంఖ్యల ద్వారా మాత్రమే కాకుండా రైతులు, సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తున్నాం అనేదే మెరుగైన ప్రయాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభివర్ణించారు. ఈ ప్రయాణంలో నాబార్డ్ కీలక భాగస్వామిగా ఉందని రాబోయే రోజుల్లో మరింత ప్రోత్సాహం అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. వ్యవసాయ రంగానికి రుణ సహాయం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. డిజిటల్ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాలని కోరారు. నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగి రైతులు అనేక పంటలు పండించే స్థాయికి చేరుకున్నారని.....నీటి కొరత ఉన్న జిల్లాలను గుర్తించి నాబార్డ్ తన సహకారాన్ని మరింత విస్తరించాలని కోరారు. నీటిని ఆదా చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేయడంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. విపరీతమైన ఎండ ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ దేశంలో అద్భుతమైన వ్యవసాయ వృద్ధిని సాధించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# 8 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు మాయం

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

దేశీయ సూచీలను వరుసగా 8వ రోజూ నష్టాలు వీడలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఇన్వెస్టర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇండియన్ స్టాక్ మార్కెట్ వరుసగా ఎనిమిది సెషన్లలో నష్టాల్లోనే ముగిసింది. ఇన్వెస్టర్లకు రూ.25 లక్షల కోట్ల నష్టాన్ని మిగిల్చింది. స్మాల్, మిడ్ క్యాప్ షేర్లు ఇన్వెస్టర్లకు ఎక్కువ నష్టాలను మిగిల్చాయి. కార్పొరేట్ సంస్థల బలహీన త్రైమాసిక ఫలితాలకు విదేశీ మదుపర్ల అమ్మకాలు తోడవ్వడంతో శుక్రవారం సెన్సెక్స్ 76,000 పాయింట్ల దిగువకు చేరింది. నిఫ్టీ కీలకమైన 23,000 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. చిన్న, మధ్య స్థాయి షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 21 పైసలు బలపడి 86.71 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.55% పెరిగి 75.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం ఒక్కరోజే దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర ఆవిరైంది. గత 8 ట్రేడింగ్ రోజుల్లో రూ.25.31 లక్షల కోట్లు తగ్గి రూ.400.19 లక్షల కోట్ల (4.61 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. గత 8 రోజుల్లో సెన్సెక్స్ 2,644.6 పాయింట్లు, నిఫ్టీ 810 పాయింట్ల చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ సూచీలో 21 షేర్లు నష్టాలు చవిచూశాయి. అదానీ పోర్ట్స్ 4.20%, అల్ట్రాటెక్ 2.47%, సన్‌ఫార్మా 2.40%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.19%, ఎన్‌టీపీసీ 2.18%, టాటా స్టీల్ 1.32%, ఎం అండ్ ఎం 1.26%, యాక్సిస్ బ్యాంక్ 1.14%, టెక్ మహీంద్రా 1.06%, కోటక్ బ్యాంక్ 0.99% చొప్పున నష్టాలు నమోదుచేశాయి. రంగాల వారీ సూచీల్లో సేవలు 3.16%, పరిశ్రమలు 3.03%, యంత్ర పరికరాలు 2.76%, విద్యుత్ 2.65%, యుటిలిటీస్ 2.52%, మన్నికైన వినిమయ వస్తువులు 2.39%, కమొడిటీస్ 2.25%, స్థిరాస్తి 2.03% కుదేలయ్యాయి. ఫోకస్డ్ ఐటీ మాత్రమే పెరిగింది. బీఎస్ఈలో 3386 షేర్లు నష్టాల్లో ముగియగా, 629 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 68 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
15.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily


## మంత్రివర్గ విస్తరణపై ఆశలు.. హుటాహుటిన ఢిల్లీకి సీఎం రేవంత్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై ఆశలు రేకెత్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. పార్టీ అధిష్ఠానం పిలుపుతో ఆయన ఢిల్లీకి వెళ్లినట్లుగా సమాచారం. ఆయన పర్యటన శుక్రవారం మధ్యాహ్నం వరకు లేదని, మధ్యాహ్నం తరువాత ఖరారు అయినందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వ, పార్టీ కార్యకమాలపై పార్టీ పెద్దలతో చర్చించనున్నట్లుగా సమాచారం. ఇందులో ప్రధానంగా కుల గణనలో పాల్గొనని వారి నుంచి సమాచారాన్ని సేకరించడానికి ఈనెల 16 నుంచి 28 ప్రత్యేక సర్వే, సర్వే పూర్తి అయ్యాక దానికి చట్టబద్దత కల్పించి దానిని కేంద్రానికి పంపించడం, స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా, పీసీసీ కార్యవర్గం ఖరారు, నామినెటెడ్‌పోస్టుల భర్తీ తదితర అంశాలపై చర్చించనున్నట్లుగా తెలిసింది. దీనితో పాటుగా మంత్రివర్గ విస్తరణ అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. గతంలో అనేక సందర్భాల్లో సీఎం తో పాటుగా పీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ, ఉత్తమ్ లాంటి వారిలో ఒకరు తప్పనిసరిగా ఢిల్లీ పెద్దలు పిలిపించి మాట్లాడే వారు కానీ ఈ సారి మాత్రం కేవలం సీఎం రేవంత్‌రెడ్డినే పిలిపించడం ఎంటనే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది.




## దేశ రక్షణలో అమర జవాన్‌ల త్యాగం మరువలేనిది

**- ఎస్ఐ వాసా ప్రవీణ్ కుమార్**

సూర్యాపేట,విశాలభారతి: దేశ రక్షణలో అమరులైన సైనికుల త్యాగం మరువలేనిదని, వారి సేవలు వెలకట్టలేనివని సూర్యాపేట పట్టణ ఎస్ఐ వాసా ప్రవీణ్ కుమార్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మ్ డ్ ఫోర్స్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్ల సంస్మరణార్థం కొవ్వొత్తులతో నిర్వహించిన శాంతి ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్ము కశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు భీకర దాడికి తెగబడ్డారని అన్నారు. ఈ ఘటనలో 40 మంది జవానులు అమరులయ్యారని అన్నారు. వీర మరణం పొందిన అమర జవాన్ల సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరవరని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఏపిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ జెపి యాదయ్య, జనరల్ సెక్రెటరీ పి.చంద్రయ్య, మాజీ సైనికులు సిహెచ్. జయరాజ్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఏ. నాగయ్య, ఏఎస్ఐ వి.ముత్తయ్య, కె.వీరస్వామి, కె.జానయ్య, ఎమ్ఎల్ఎన్ రెడ్డి, ఇమ్మడి సోమయ్య, డి.నాగులు, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ,యమా సంతోష్, పబ్బతి వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బిస్కెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు జాతరకు సూర్యాపేట డిపో నుండి 60 ప్రత్యేక బస్సులు

**- టీజీఎస్ఆర్టీసీ ఆర్ఎం జాన్ రెడ్డి**



సూర్యాపేట,విశాలభారతి: తెలంగాణ రాష్ట్రంలో రెండేండ్లకు ఒకసారి జరిగే రెండవ అతిపెద్ద జాతరైన దురాజ్ పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి వారి జాతరకు భక్తుల సౌకర్యార్థం సూర్యాపేట డిపో నుండి 60 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర ఈ నెల 16న తెల్లవారుజామున ప్రారంభమై ఈ నెల 20 వరకు జాతర కొనసాగనుందని తెలిపారు.లింగమంతుల స్వామి వారి జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు.సూర్యాపేట నుండి పెద్దగట్టు జాతరకు బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 అని తెలిపారు.జాతరకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి భక్తులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు.ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితం, సుఖవంతమని అన్నారు.





# పెద్ద గట్టు జాతర నిర్వహణకు అంతా సిద్ధం

- **ఫిబ్రవరి 16 నుండి 20 వరకు పెద్దగట్టు జాతర.**
- **భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సదుపాయాలు.**
- **సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.**
- **అంగరంగ వైభవంగా జాతరను నిర్వహించాలి.**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.**

సూర్యాపేట,విశాలభారతి: తెలంగాణ లో రెండవ అతి పెద్ద జాతరగా ప్రసిద్ధిగాంచిన దురాజ్ పల్లి పెద్దగట్టు లింగామంతుల స్వామి జాతర ఫిబ్రవరి 16 నుండి 20 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. శుక్రవారం పెద్దగట్టుపై జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెజస్ మాట్లాడుతూ గతంలో కంటే భక్తులు అధికంగా జాతరకు వచ్చే అవకాశం ఉన్నందున అందుకనుగుణంగా ఏర్పాట్లను చేశామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు రెండువేల మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. అలాగే ప్రత్యేకంగా వందమందితో షీ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతర పరిసర ప్రాంతాలలో మొత్తం 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా వివరించారు . దేవాదాయశాఖ ద్వారా శానిటేషన్ సిబ్బంది ని నియమించడం జరిగిందని షిప్టుకు 30 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో 90 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఐదు రోజులపాటు పని చేస్తారని తెలిపారు . మరో 37 మంది అధికారులు పర్యవేక్షిస్తారు అన్నారు . జాతరలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా 110 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది తో 9 లొకేషన్ ను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మిషన్ భగీరథ ప్రధాన పైప్ ద్వారా భక్తులకు త్రాగు నీరు అందింస్తామని, ఇందులో భాగంగా గుట్ట కింది భాగంలో 20వేల లీటర్ల,గుట్టపై ప్రత్యేక ట్యాంకు ఏర్పాటు చేసి నీటిని అందిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం గుట్ట పరిసర ప్రాంతాలలో 25 చోట్ల నల్లాలను, 12 చోట్ల టబ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 8 చోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో 24 మంది డాక్టర్లతో పాటు 190 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని, మూడు అంబులెన్స్ లను అందుబాటులో ఉంచామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో 60 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, 200 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. గుట్ట వద్ద మూడు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఐదు రోజులపాటు ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. గుట్ట పరిసర ప్రాంతాల్లో ఫుడ్ కమిటీలు పర్యవేక్షిస్తాయని కలుషిత ఆహార పదార్థాల నియంత్రించేందుకు కృషి చేస్తామన్నారు. జాతరలో ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే సూర్యాపేట ఆర్డిఓ, జాతర నోడల్ అధికారి వేణుమాధవ్ కు సమాచారం అందించాలని తెలిపారు. సమావేశ అనంతరం అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు .ఈ కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మన్ పోలబోయిన నరసయ్య యాదవ్, సిపిఓ ఎల్ కిషన్, జిల్లా వైద్యాధికారి కోటాచలం, సూర్యాపేట డిఎస్పి రవి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తాసిల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి, కృష్ణయ్య, దేవాలయ ఈవో కుశలవయ్య, ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, గ్రిడ్ఈ ఈ కర్ణాకర్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి పాలరాజ్,ఎడిఈ రాములు నాయక్, జిల్లా అగ్నిమాపక అధికారి యజ్ఞ నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## షీ టీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన

సూర్యాపేట,విశాలభారతి: ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పి నాగేశ్వరరావు సూచనలతో సూర్యాపేట షీ టీమ్స్ మహిళా ఎస్ఐ నీలిమ శుక్రవారం పట్టణం లోని ఎస్వి ఇంజనీరింగ్ కాలేజీ లో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలపైన పోలీసు కళాభృందంతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా షీ టీమ్స్ మహిళ ఎస్ ఐ నీలిమ మాట్లాడుతూ జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అధ్వర్యంలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్, కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని, బ్యాంక్ ఖాతా, ఎటిఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని అన్నారు. ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దని,మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని కోరినారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు.ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే సూర్యాపేట షీటీం ఫోన్ నెంబర్ 8712686056 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. మీయొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డిపి లుగా పెట్టుకోవద్దని చెప్పారు. మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దు ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దని సూచించారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. పుట్టిన తేదీలను,ఫోన్ నెంబర్లను పాస్వర్డ్ గా పెట్టుకోవద్దని సూచించారు.సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డ్లు పెట్టుకోవాలని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు ఎస్వి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, బోధన సిబ్బంది, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, షీ టీమ్స్ ఎఎస్ఐ సాలయ్య, పోలీస్ కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, సభ్యులు గోపయ్య, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## సూరారం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం

విశాలభారతి,ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో పేదలకు అందించవలసిన బియ్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మధ్యాహ్నం రెండు గంటలకు సమాచారం రాగా వెంటనే ఎస్సై ప్రవీణ్ కుమార్ హెడ్ కానిస్టేబుల్ విటల్ కానిస్టేబుల్ రాజు హోంగార్డ్ వీరస్వామి అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. సూరారం గ్రామ చర్చి పక్కకు దాదాపు 31 క్వింటాల ప్రజా పంపిణీ బియ్యం బస్తాలు ఉండగా ఇట్టి బస్తాల ప్రక్కనే నర్రావుల ఆంజనేయులు సన్నాఫ్ మల్లయ్య వయసు 25 సంవత్సరాలు వృత్తి గంగిరెద్దులతో తిరిగి భిక్షాటన. గ్రామం కొప్పూర్ మండలం భీమదేవరపల్లి అను అతడు ప్రజల వద్ద నుండి పది రూపాయల కిలో చొప్పున పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి వాటిని తిరిగి కిలో 16 రూపాయలు చొప్పున కోళ్ల ఫారాలకు అమ్ముతాడని తెలుపగా నర్రావుల ఆంజనేయులుపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.



## బిజెపి అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలి

విశాలభారతి,ఎల్కతుర్తి: ఎల్కతుర్తిలో బిజెపి మండల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ ఎలక్షన్లో బిజెపి మొదటి స్థానంలో గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షులు మెదక్ కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏల్కతుర్తి మండలకేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన బిజెపి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో, బిజెపి కరీంనగర్ పార్లమెంటు ప్రభారి బోయినపల్లి ప్రవీణ్ రావు హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మరెడ్డి పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల కు చేపట్టవలసిన కార్యాచరణను గూర్చి దిశా నిర్దేశం చేసినట్లుగా పేర్కొన్నారు. మెదక్ కరీంనగర్ నిజామాబాద్ అదిలాబాద్ నియోజకవర్గ బిజెపి బలపరచిన గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా ప్రతి ఒక్క ఓటర్ని కలిసి అభ్యర్థించాలని తెలియజేశారు.ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య. ముస్కే వెంకటేష్ యాదవ్. జనగాని కిష్టయ్య. ఆడపు శ్రీవర్ధన్.పల్లెపాటి మధుకర్. ఎర్రోల్ల రాజు. చిదురాల వెంకటేష్. వీరమల్ల కృష్ణారెడ్డి. అల్లి కుమార్. కోరే కార్తిక్. కోడం రమేష్. ఎర్రగోళ్ల రాజు. వంగ రమేష్. గడ్డం మధుకర్ రెడ్డి. రాకేష్. నరేష్. కొలిపాక శ్రీను. సిద్ధు. వినయ్. వేల్పుల శ్రీను. కిరణ్. బొక్కలపాటీ కుమార్. మంతూర్తి తిరుపతి. పోలు శివ తదితరులు కర్యకర్తలు పాల్గొన్నారు.






## పూణేలో ముల్కనూర్ సొసైటీ సక్సెస్ స్టోరీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- **అందించిన సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి**

విశాలభారతి,భీమదేవరపల్లి : సహకార రంగంలో ప్రపంచ స్థాయిలో ఘనత సాధించిన ముల్కనూర్ కోఆపరేటివ్ సొసైటీ సక్సెస్ స్టోరీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను శుక్రవారం పూణేలో సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ఆవిష్కరించారు. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ కో.ఆపరేషన్ ట్రైనింగ్ అగ్రికల్చరల్ బ్యాంకింగ్ సంస్థ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పూణేలోని వైకుంఠ మెహతా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కో.ఆపరేటివ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13 నుండి 15 వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ అంతర్జాతీయ సహకార సంఘ ప్రతినిధులు హాజరయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో సహకార సంస్థలకు స్ఫూర్తిగా ముల్కనూర్ సహకార సంఘం నిలుస్తుందని, సొసైటీ అందిస్తున్న సేవలను పలువురు ప్రతినిధులు కొనియాడారు.

# సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి




**తొర్రూరు, విశాలభారతి:**

పాలకుర్తి మండలంలోని ఎల్లమ్మ గడ్డ తండా రోడ్డులోని శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం నందు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించే భోగ్ బండారో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ లాల్ జయంతి సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. కావున పాలకుర్తి నియోజకవర్గంలోని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని సేవలాల్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటి ఎన్నిక

- **నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కృష్ణ నాయక్ ఎన్నిక**



**నూతనకల్ విశాలభారతి:**

శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాల కమిటీని శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఎన్నుకున్నారు. మండలంలోని బక్క హేమ్లాతండ గ్రామానికి చెందిన గుగులోతు కృష్ణ నాయక్ ఉత్సవ కమిటీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. తుంగతుర్తి మండల కేంద్రలో జరిగే జయంతి ఉత్సవాలకు నియోజకవర్గంలోని గిరిజనులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. తన నియామకానికి సహకరించిన తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, ఎంపి చామల కిరణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ప్రయోగాత్మక పాఠవాల మార్కుల జాబితాల పరిశీలన

**నూతనకల్ విశాలభారతి:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు మండల పరిధిలోని లింగంపల్లి, మిర్యాల, పెదనెమిల, ఎర్రపహాడ్ గ్రామాలలోని ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల ప్రయోగాత్మక పాఠవాల మార్కుల జాబితాలను,రికార్డులను అంతర్గత మార్కుల పరిశీలనాధికారి గోపగాని సోమయ్య బృందం శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే పదవ తరగతి అంతర్గత మార్కుల మూల్యాంకనం చేయాలని అన్నారు.ప్రతి విద్యార్థి ఆయా అంశాలలో చూపిన నైపుణ్యం ఆధారంగానే మార్కుల నమోదు ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పరిశీలన బృందం అధికారులు రామలింగారెడ్డి,శ్రీనివాస్,రామ్ కుమార్ రెడ్డి,బిక్షం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్,బిక్కి రామన్న, మతిన్, సౌమ్య, నవ్య, ప్రియాంక పాల్గొన్నారు.





# ఘనంగా షబ్ - ఏ- బరాత్ వేడుకలు

- **భక్తిశ్రద్ధలతో రాత్రంతా అల్లాహ్**
- **ధ్యానంలో జాగరణ**

**ఆమనగల్లు,విశాలభారతి :**

ముస్లిం సోదరులు షబ్ ఏబరాత్ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు షబ్ ఏబరాత్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా షబ్ ఏబరాత్ వేడుకలలో భాగంగా ముస్లిం సోదరులు ఆయా గ్రామాల్లోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలను పూర్తి చేసుకొని ముస్లిం మత గురువులు, ఇమామ్ లు చెప్పే పవిత్ర గ్రంథం ఖురాన్ ధర్మ సందేశాన్ని భక్తిశ్రద్ధలతో శ్రద్ధగా విన్నారు. అనంతరం అల్లాహ్ ధ్యానంలో షబ్ ఏబరాత్ వేడుకలలో భాగంగా అల్లాహ్ ను గుర్తు చేసుకుంటూ రాత్రంతా సాముహిక జాగరణ చేశారు. ఆయా మసీదులలో ముస్లిం చిన్నారులు ఇస్లాం,నాతే ఏ షరీఫ్ లను వినిపించి, ఖురాన్ ధర్మసందేశాలను, సూక్తులను ఓపికతో వినిపించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులు ముస్లిం స్మశావాటికలకు సామూహికంగా బయలుదేరి వెళ్లి గతంలో మరణించిన కుటుంబ సభ్యులకు, బంధువులకు ఘనంగా నివాళ్ళు అర్పించారు. షబ్ ఏబరాత్ వేడుకలలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని మసీదులను ఆయా మసీదు కమిటీల పెద్దలు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**ప్రతి ముస్లిం అల్లా అడుగు జాడల్లో నడుచుకోవాలి**

ప్రతి ముస్లిం అల్లా అడుగు జాడల్లో నడుస్తు పరుల హితాన్ని కోరుకోవాలని మౌలానా అబ్దుల్ వహిద్, లతిఫ్ లు సూచించారు.అల్లా చూపిన మార్గంలో ముందుకు సాగుతు పవిత్ర త్యాగం నీతి నిజాయితీ లకు మారుపేరు గా ముస్లిం మైనారిటీ లు ఎదగాలని వారు పేర్కొన్నారు. ముస్లిం పవిత్ర గ్రంథంలో ఖురాన్ పొందుపరిచిన అంశాలు ఖురాన్ విశిష్టత ముస్లిం అలవార్చుకోవాల్సిన పద్ధతులు తదితర విషయాలపై ముస్లింలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని వారు సూచించారు. అనంతరం ఆయా మస్జీద్ లలో నిర్వహించిన దువా జాగరణ కార్యక్రమం లో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
15.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## హీరో విజయ్ కు Y+ కేటగిరీ సెక్యూరిటీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తమిళ స్టార్ హీరో విజయ్ తమిళనాడులో తమిళగ వెట్రి కళగం అనే పార్టీని పెట్టి పూర్తి స్థాయి రాజకీయాలకు రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. పార్టీని అనౌన్స్ చేస్తున్న టైమ్ లోనే విజయ్ 2026లో తమిళనాడులో జరిగే ఎన్నికల బరిలో పోటీ చేస్తామని ప్రకటించాడు. అందులో భాగంగానే ప్రజలకు సంబంధించిన అంశాలపై కూడా ఆయన తన ఓపీనియన్ ను సూటిగా చెప్తున్నాడు. ఈ నేపథ్యంలో టీవీకే అధినేత విజయ్ కు సంబంధించి కేంద్ర హోం శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. విజయ్ కు Y+ కేటగిరీ భద్రత కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు ప్రమాదం పొంచి ఉన్న కారణంగానే విజయ్ కు కేంద్రం ఈ భద్రతను కల్పించింది. అయితే ఇది దేశంలోనే నాలుగో అత్యున్నత స్థాయి భద్రత. మొదటి భద్రతా విభాగం SPG. ఇది ప్రధాని, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, రాష్ట్రపతికి కల్పిస్తారు. పదవి, వారికి ఎదురయ్యే భద్రతను బట్టి అందులో భద్రతా సిబ్బంది ఉంటారు. SPG తర్వాత రెండో కేటగిరీ Z+ కేటగిరీ. మాజీ ప్రధానులు, మాజీ రాష్ట్రపతులతో పాటూ తీవ్ర ప్రమాదం పొంచిఉన్న నాయకులకు కూడా ఈ భద్రత కల్పిస్తారు. Z+ తర్వాత Z కేటగిరీ భద్రత మూడోది. ఇక నాలుగోది కేంద్ర ప్రభుత్వం విజయ్ కు ఇచ్చిన Y+ కేటగిరీ భద్రత. ఈ భద్రతలో మొత్తం 11 మంది ఉంటారు. నలుగురు కమెండోలు, మిగిలిన వారు పోలీసులు ఉంటారు. సల్మాన్ ఖాన్, కంగనా రనౌత్, షారుఖ్ ఖాన్‌కు ఈ భద్రత ఉంది. దీనికి సుమారు నెలకు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుంది.







# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

- **దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వాలే**
- **తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది**
- **కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి**

**పటాన్ చెరు,విశాలభారతి**

శాసనమండలి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలోని శ్రీ కన్వెన్షన్ లో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి మెదక్ ఎంపీ. రఘునందన్ రావు తో కలిసి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థులు సి.అంజిరెడ్డి, కొమురయ్యలను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో సమర్థవంతమైన, నీతివంతమైన పాలన కొనసాగుతుందని, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఇలాంటి పాలననే కోరుకుంటారని చెప్పారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి అంతమైందని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత దేశంలో ఐఎస్ఐ ఉగ్రవాదాన్ని అణిచివేయడం జరిగిందని చెప్పారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి, సమర్థవంతమైన పాలన కొనసాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జిహెచ్ఎంసి సిబ్బందికి జీతాలు ఇవ్వని పరిస్థితుల్లో ఉన్నదని, తెలంగాణలో ఆర్థిక సంక్షోభం వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. మెదక్ ఎంపీ ఎం రఘునందన్ రావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొమరయ్యలను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీ ఎన్నికల్లో పటాన్ చెరు నియోజకవర్గంలో తనకు లక్ష పైచిలుకు ఓట్లు వచ్చాయని, బిజెపి శ్రేణులు అదే స్ఫూర్తితో పని చేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోని కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్నదని, మిగతా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బిజెపి పాలన కొనసాగుతుదన్నారు. మియాపూర్ నుండి పటాన్ చెరు వరకు మెట్రో రైలు సాధించిన ఘనత బిజెపికే దక్కిందన్నారు. సమావేశంలో బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, రాజేశ్వరరావు, దేశ్ పాండే, ఆదెల్లి రవీందర్, ప్రతాప్ రెడ్డి, ఎడ్ల రమేష్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# ఇలాంటి మంచి అధికారులే సమాజానికి అవసరం

- **నిరుపేద యువకుడికి అండగా నిలిచిన మణుగూరు తహసీల్దార్**





**మణుగూరు, విశాలభారతి:**

పెద్దిపెల్లి గ్రామానికి చెందిన పొడియం దేవా ఇటీవల తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగిపోయింది. అతను హాస్పిటల్‌లో చేరిన, ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఆపరేషన్ చేయించుకునే అవకాశం లేకుండా పోయింది. వైద్యులు అతని కాలి శస్త్రచికిత్స కోసం రూ.90,000 ఖర్చు అవుతుందని తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న మణుగూరు మండల తహసీల్దార్ రాఘవరెడ్డి మానవతా ధృక్పథంతో స్పందించి, తన సొంత డబ్బులతో అతన్ని హైదరాబాద్ కు పంపించి, ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం పొందేలా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ చొరవతో దేవాకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించబడింది, ప్రస్తుతం అతని ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది. పేదవాళ్ల కష్టాలను చూసి వెనుకంజ వేయకుండా, తన సొంత డబ్బులతో సహాయం చేసి ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స అందించడానికి ప్రయత్నించడం తహసీల్దార్ గొప్ప మనసు ఆయన మానవీయ స్పందన పట్ల గ్రామస్థులు, దేవా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి మంచి అధికారులే సమాజానికి అవసరం అని ప్రశంసించారు.



# గ్రామ సమస్యలపై పంచాయితీ కార్యదర్శులతో సమావేశం

**వేలేరు ,విశాలభారతి :**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీవో ఇమ్మడి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న హాజరైనారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలలో మంచి నీటి సమస్యలు, శానిటేషన్, టాక్స్ కలెక్షన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, లేబర్ ను పెంచుట, నర్సరీల సంరక్షణ వివిద పనుల గూర్చి చర్చించనైనది. అనంతరం మల్లికుదుర్ల గ్రామ పంచాయతీలో వివిధ పనులు, శానిటేషన్, నర్సరీలు పరిశీలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లక్ష్మి ప్రసన్న, ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# వివాహ వేడుకకు హాజరైన కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి

**జహీరాబాద్, విశాలభారతి:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహీర్ మండలంలోని ఖానాపూర్ మాజీ సర్పంచ్ జవహర్ బాబు ,కూతురి వివాహ వేడుకకు, జహీరాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి,హాజరై వధువు వరులకు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.రామలింగారెడ్డి, కోహీర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, మాజీ జడ్పీటీసీ రాందాస్,మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మల్లన్న పాటిల్,కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రాథోడ్ వినోద్ కుమార్,ఎస్సి సెల్ అధ్యక్షులు అనిల్,మాజీ ఎంపీటీసీ గొల్ల దుర్గ ప్రసాద్, మాజీ సర్పంచ్ లు అడివి రెడ్డి,సంసన్, మల్లికార్జున, బచ్చయ్య,కాంగ్రెస్ నాయకులు ఎక్కబల్,మొయిజ్ లస్కరి,సురేష్,మైసయ్య, సాగర్,తదితరులు పాల్గొన్నారు.



# యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

- **గంజాయి అమ్మిన, సేవించినా సమాచారం అందించండి.**
- **కాలేజీ విద్యార్థులచే ప్రతిజ్ఞ**
- **ముల్కనూర్ ఎస్సై సాయిబాబు**

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళాబృందం, ముల్కనూర్ పోలీస్ ఆధ్వర్యంలో ముల్కనూర్ ఏకెవిఆర్ జూనియర్ కాలేజ్, మోడల్ స్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయిబాబు మాట్లాడుతూ, యువత డ్రగ్స్, గుట్కా, మత్తు పదార్థాల బారిన పడవద్దని, ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా 8712584473 మొబైల్ నెంబరుకు సమాచారమందించాలని సూచించారు. పోలీస్ కళాజాత బృందం రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్, సైబర్ క్రైమ్స్, సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 గురించి తెలుపుతూ, పలు అంశాలపై పాటలు పాడుతూ, కాలేజ్ పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏకేవిఆర్ ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, ఏఎస్ఐ సంపత్, కాలేజ్ యాజమాన్యం, అధ్యాపక బృందం, పోలీస్ కానిస్టేబుల్ ఆఫీసర్స్, కళాబృందం ఇంచార్జి డబ్ల్యూ.ఏ.ఎస్సై నాగమణి, హెడ్ కానిస్టేబుల్స్ విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోంగార్డ్స్ శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి విద్యార్థులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
15.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# గౌడ కులస్తులు అభివృద్ధికి కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం,విశాలభారతి:

గౌడ కులస్తుల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ నుండి మంజూరైన కటమయ్య కిట్స్ నీ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 7 గురు లబ్దిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘం వారికి ఎలాంటి ఆపద వచ్చిన తన ముందు వుంటానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మీర్పేట్ హెచ్.పీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుల్వామలో అమరులైన జవాన్లకు ఘన నివాళులు

పెద్ద అంబర్పేట్, విశాలభారతి: పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పసుమాముల మూడవ వార్డు శ్రీనగర్ కాలనీ నందు వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రెసిడెంట్ కంభంపాటి సోమయ్య ఆధ్వర్యంలో పుల్వామా ఉగ్రవాదుల దాడిలో దేశం కోసం ప్రాణాలను అర్పించిన 40 మంది వీర సైనికులను స్మరిస్తూ ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా వయసుతో సంబంధం లేకుండా చిన్నలు పెద్దలు మహిళలు అందరు పాల్గొని అమరులైన వీర జవాన్లకు ఘన నివాలి అర్పించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు పెద్దలు, పాల్గొన్నారు





# అమరవీర జవానుల ప్రాణత్యాగాలకు జోహార్లు

నేరేడుచర్ల విశాలభారతి:

14 ఫిబ్రవరి 2019 రోజున పుల్వామా దాడి ఘటనలో అమరులైన వీర జవానులను, అదేవిధంగా యావత్ భారత అమర జవానుల ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ నేరేఢుచర్ల ఆర్మీ అబిమానులు వారి గుర్తుగా కొవ్వొత్తులను వెలిగించి, వారికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్మీ సోదరులు తమ కన్న తల్లిదండ్రులను, కట్టుకున్న భార్యను, కన్న పిల్లలను వదిలి దేశ రక్షణ కొరకు, మన రక్షణ కొరకు మంచు కొండల్లో, లోయల్లో, అడవుల్లో, క్రూర మృగాల మధ్య ఎండకు,వానకు,చలికి ఇబ్బంది పడుతున్నా, ప్రాణాలు పోతున్నా, లెక్కచేయకుండా శత్రువులతో పోరాడుతున్నందుకు వారికి మనం ఎల్లప్పుడూ బుణపడి ఉంటామని అన్నారు.

# ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగు

పినపాక, విశాలభారతి:

సాగు చేయడమే కాకుండా దుక్కి దున్నడం, పురుగు మందు పిచికారీ స్వయంగా చేస్తున్నారు. ఆమె పినపాక మండలం గాండ్లబయ్యారం గ్రామానికి చెందిన పాపాల. సాయిలక్ష్మీ ప్రసన్న. తన ఇంటి సమీపంలోని సుమారు 10 ఎకరాల భూమిలో వంగ, బెండ, దోస, సోరకాయలతోపాటు కొంతమేర వరి సాగును చేపట్టారు. భర్త రాంబాబు, అత్త వజ్రమ్మ సహకారంతో విత్తనాలు నాటే సమయం నుంచి కాపు వచ్చేవ రకు చేపట్టాల్సిన సాగు పనులు మొత్తం తానే చేస్తుంది. పండిన పంట ఉత్పత్తులను అత్త సహకారంతో సమీప పట్టణాల్లో జరిగే సంతలకు తరలించగగా విక్రయాలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమం వేదికగా తాను సాగు చేస్తున్న పంటలు అవలంభిస్తున్న యాజమాన్య పద్ధతులను ప్రజలకు తెలియజేసేలా 'ఎస్ఆర్ విలేజ్ ఆగ్రికల్చర్' పేరుతో ఇన్స్టాగ్రాం అకౌంట్తో పాటు యూట్యూబ్ ఛానల్ సైతం



ప్రారం భించింది. కూరగాయల సాగులో వచ్చే చీడపీడల నివారణకు తాను చేపట్టిన రక్షణ చర్యలు, వచ్చిన పలి తాలను వివరిస్తూ పోస్టులు పెడుతోంది. ఈమె యూట్యూబ్ ఛానెల్ న్ను సుమారు 3.22 లక్షల మంది సబ్ స్క్రైబ్ చేసుకున్నారు. రానున్న రోజుల్లో సాగు విస్తీర్ణం పెంచేలా ఆలోచన చేస్తున్నాం అని అన్నారు.




# 16న జరిగే సదస్సును జయప్రదం చేయాలి

తొర్రూరు, విశాలభారతి:

ఈనెల 16న హైదరాబాద్ లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఓంకార్ భవన్ లో జరిగే సదస్సును జయ ప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు, పార్టీ సీనియర్ నాయకుడు బండపల్లి వెంకటేశ్వర్లు లు పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేయాలని, రైతుబంధును పూర్తిగా ఇవ్వాలని, రేషన్ కార్డులు, ఇల్లు లేని వారికి ఇల్లు ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు భృతి ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిందన్నారు. కేంద్రం పబ్లిక్ సెక్టర్ ను పూర్తిగా ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. దేశంలోని వనరులన్నింటినీ బడా పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు బిజెపి ప్రభుత్వం దోచిపెడుతుందన్నారు. చత్తీస్గడ్ రాష్ట్రంలో గిరిజనులు తమ అమూల్యమైన అటవీ సంపదను విలువైన ఖనిజాల్ని ఆదానే అంబానీ రిలయన్స్ లాంటి వేదాంత లాంటి పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతుంటే ప్రతిఘటిస్తున్న గిరిజనుల రక్తాన్ని ఏరులై పారుస్తూ, నిత్యం గిరిజనులను చంపుతున్నారు. కార్యక్రమంలో రైతులు వెంకట్రాం నరసయ్య, రాజమ్మ ,కృష్ణమూర్తి, మొగిలి, వెంకటయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం

- రైతులకు రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ సర్కార్దే
- కోహెడలో ప్రపంచస్థాయి వ్యవసాయ మార్కెట్
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్, విశాలభారతి:




రైతు సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ సర్కార్కే దక్కిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పునరుద్ఘాటించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోడౌన్లను మల్రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు.అనంతరం టెస్కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కోహెడలో త్వరలోనే ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రాబోతోందని అన్నారు. ఇప్పటికే సేకరించిన 175 ఎకరాల స్థలంలో సీఎం రేవంత్రెడ్డి శంకుస్థాపన చేయబోతున్నారని వెల్లడించారు. దీనికి అదనంగా మరింత భూమిని సేకరించి, సుమారు రూ.4వేల కోట్లతో మార్కెట్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. అలాగే రైతు సేవా సహకార సంఘాలు రైతన్నలకు వెన్నుదన్నుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని, లాభసాటిగా మారాలని సూచించారు. తుర్కయంజాల్ ఎఫ్ఎస్సీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన గోడౌన్లను వ్యాపార కోణంలోనే చూడొద్దని సూచించారు. రైతులకు ఉచితంగా ధాన్యం, ఇతరత్రా నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. లాభాల్లో నడుస్తున్న సహకార సంఘాలు ఆయా గ్రామాల పరిధిలో సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని అన్నారు. రైతులను ఆదుకోవడమే కాకుండా, శిథిలావస్థకు చేరుకున్న స్కూల్ భవనాలకు రంగులు వేయించడం, ఫర్నిచర్ లాంటి వస్తువులు సమకూర్చాలన్నారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ కరోనా సమయంలో ఎఫ్ఎస్సీఎస్ ఆధ్వర్యంలో స్కూళ్లకు టీవీలు సమకూర్చామని, త్వరలోనే స్కూళ్లకు మరమ్మతులు చేయించే పనికి శ్రీకారం చుడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి, ఎఫ్ఎస్సీఎస్ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, శీలం లక్ష్మమ్మ, చెక్క లక్ష్మమ్మ, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, సామ సంజీవరెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, జిట్టా భార్గవి, కుతాడి నర్సింగ రావు, కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్రాజ్గౌడ్, కొశికె ఐలయ్య, బొక్క రవీందర్రెడ్డి, సామ భీంరెడ్డి, కొంతం వెంకటరెడ్డి (జానీ), బీజేపీ నాయకులు కందాడ బలదేవరెడ్డి, ఎలిమినేటి నర్సింహారెడ్డి, బ్యాంకు సీఈవో వై.రాందాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

- హయత్ నగర్ మండల కార్యాలయంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన
- శ్రీ శ్రీ ఆదిత్య పరాస్త్రి స్వామి వారి ఆధ్వర్యంలో

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

హయత్ నగర్ మండల కార్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పురాతన ఆలయ స్థానంలో 65 లక్షల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభించారు. 14న గణపతి పూజ, పుణ్య హవాచన, రక్షబంధనము, పంచగవ్య ప్రాశన, యాగశాల ప్రవేశం, రూత్విగ్వరణము, 16న 5:24 నిమిషాలకు గర్ధ న్యాసము, 8 :32 నిమిషాలకు యంత్ర విగ్రహ ప్రతిష్టాపన బలిహరణ, పూర్ణాహుతి, కళాన్యాసము, ఆశీర్వాచనములు సన్మానములు సాయంత్రం బోనాల సమర్పణ ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.




# పుల్వామ అమర జవాన్ల త్యాగం మరువలేనిది

తొర్రూరు, విశాలభారతి:

పుల్వామలో అమరులైన వీర యోధుల ను స్మరిస్తూ ఈరోజు తొర్రూరు పట్టణంలో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆద్వర్యంలో స్థానిక అమరవీరుల స్థూపం వద్ద వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది .ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు మాట్లాడుతూ 2019లో జమ్మూ నుంచి శ్రీనగర్ వెళుతున్న భారత సైనికులపై పుల్వామ వద్ద పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర మూకలు దొంగచాటుగా బాంబు దాడుల కు ఫాల్పడి 20మంది ని పొట్టన పెట్టుకున్నారని,పుల్వామ అమర జవాన్ల త్యాగం మరువలేనిది అని వారి ఆత్మ లకు శాంతి చేకూరేలా ప్రతీ భారతీయుడు ఈరోజు వారికి నివాళులు అర్పించాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోడీ పుల్వామ దాడికి పాల్పడిన ఉగ్ర మూకలను సర్జికల్ స్ట్రైక్స్ చేసి అంతమొందించి ప్రతీకారం తీర్చుకున్నాడు అని, దాయాదులు మరోసారి భారత్ వైపు కన్నెత్తి చూడకుండా చావుదెబ్బ తీసశాడని,భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా ధేశ భద్రత కోసం రాజీ లేని నిర్ణయాలు తీసుకోవడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లె కుమార్, తొర్రూరు రూరల్ మండలం అద్యక్షుడు గట్టు రాంబాబు, జిల్లా, మండల నాయకులు ఎనగందుల శ్రవణ్, అలిసెరి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.






# రైతు సహకార సంఘం సర్వసభ్య సమావేశం

- సంఘ సభ్యత్వంకై సభ్యులు తమ భూమి వివరాలు ఇవ్వాలి
- భూమి వివరాలు లేనియెడల సభ్యత్వం తొలగించడం జరుగుతుంది
- వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు చామ కృష్ణారెడ్డి

పెద్ద అంబర్పేట్, విశాలభారతి:

రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు చామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.... 1987 సంవత్సరంలో ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతి లో రైతులందరికీ రుణ సదుపాయం కల్పించినందున సంఘం పరిధిలోనున్న అన్ని గ్రామాల సన్నకారు చిన్న కారు మరియు పెద్ద కారు రైతులకు స్వల్పకాలిక, మధ్య కాలిక, దీర్ఘకాలిక రుణాలను అందించాలని ఉద్దేశంతో ఈ సహకార సంఘాలను రూపొందించడం జరిగిందని అన్నారు. సకాలంలో అన్ని రకముల అప్పులను చెల్లించిన సభ్యులకు అపరాధ వడ్డీ ఉండదు సభ్యులు ఈ యొక్క విషయమును గమనించాలి సంఘంలోని సభ్యులు యొక్క ఈ కేవైసీ భూమి వివరాలు సమర్పించి సంఘం సభ్యత్వం కొనసాగింపుకు సహకరించాలని కోరారు. భూమిలేని సభ్యుల యొక్క సభ్యత్వం తొలగించబడుతుందని అన్నారు. అనంతరం కళ్లెం శంకర్ రెడ్డి హయత్ నగర్ వాసి మాట్లాడుతూ చనిపోయిన రైతుల యొక్క సభ్యత్వం తొలగించాలని సభలో తెలిపారు. ఎల్మేటి బుచ్చి రెడ్డి మునగనూరు రైతు మాట్లాడుతూ భూమిలేని సభ్యుల వివరాలను వెలికి తీసి వారి సభ్యత్వాలను కూడ రద్దు చేయాలని కోరారు జోర్క శ్రీరాములు కుంట్లూర్ వాసి రైతుల యొక్క భూమి వివరాలను వారి సభ్యత్వం వివరాలను సంఘం కార్యాలయం నందు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సంఘం యొక్క 2024 25 సంవత్సర జమ ఖర్చులు మరియు 2023 24 ఆడిట్ వివరాలను సభలో సంఘం ముఖ్య కార్యదర్శి డి మల్లికార్జున్ చదివి వివరించగా సభలో చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించడం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగం ఉపాధ్యక్షురాలు ఢిల్లీ విజయలక్ష్మి,,బండ రావిరాల మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాస్ రెడ్డి చిన్న రావిరాల మాజీ సర్పంచ్ వనజా శ్రీనివాస్ రెడ్డి , పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ సుప్రసేనారెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొండల్ గౌడ్ మరియు ప్రాథమిక సహకార సంఘం కార్యవర్గ సభ్యులు ముత్యాల రాజశేఖర్, కళ్లెం ప్రభాకర్ రెడ్డి,పెద్దిటి నరసింహారెడ్డి, గడ్డం యాదమ్మ, వేదవతి, కిన్నెరి నర్సమ్మ,ముత్తడి సుధాకర్ రెడ్డి, దోమలపల్లి అంజయ్య,వై జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
15.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
6
vishalabharathi Telugu Daily





అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ.

# చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తాం

- చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- గురునాథం చెరువు సుందరీకరణ
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నియోజకవర్గంలోని చెరువులకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామని పిఏసి చైర్మన్,ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. అందులో భాగంగానే హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని కైదమ్మ కుంట చెరువు ను నెక్సస్ సెలెక్ట్ మాల్ కంపెనీ సిఎస్ఆర్ ఫండ్స్, మళ్లీ గావాడ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చెరువు సుందరీకరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఇలాగే కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పరిశ్రమలు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఇదొక చక్కటి శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కీలకమైన సహజ వనరులను పునరుద్ధీవింప చేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. నేటితో గురునాథం చెరువు దశాదిశ మారుతుందని ఎన్నో ఏళ్ల సమస్య నేటికీ శాశ్వత పరిష్కారం లభించినట్లు అయిందన్నారు. మురికి కోపం లాంటి చెరువు స్వచ్ఛమైన మంచినీళ్లు లాగా కీర్తించమని ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. అలాగే చెరువు చుట్టూ పటిష్టమైన కంచె, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలుపేతం పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డిఈ నళిని, ఏఈ పావని,రెవిన్యూ అధికారులు సర్వేయర్ జగదీశ్వర్,మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,దాత్రినాథ్ గౌడ్, పవన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, మల్లేష్ గౌడ్,ప్రకాష్ గౌడ్, సురేష్,సాదిక్,ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిని పరమశించిన గాదరి కిషోర్



**నూతనకల్, విశాలభారతి:**

సూర్యాపేట పట్టణంలో నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల పార్టీ ప్రచార కార్యదర్శి రేసు వెంకటేశ్వర్లు ఇటీవల ప్రమాదవశాత్తు కాలుకు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని డా.గాదరి కిశోర్ కుమార్ తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు పరామర్శించారు వారి త్వరగా కోలుకోవాలని తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# 78 ఏళ్ల స్వాతంత్ర్యంలో కూడు,గూడు,గుడ్డ,కోసం పోరాటం సిగ్గు చేటు

- యంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్
- ఘనంగా యంసిపిఐ (యు) నేత తాండ్ర కుమార్ 3వ వర్ధంతి



సభను ఉద్దేశించి మాట్లాడుతున్న మద్దికాయల అశోక్ ఓంకార్.

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచిన నేటికీ కూడు,గూడు,గుడ్డ, కోసం బడుగు జీవులు పోరాటం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని యంసిపిఐ(యు) జాతీయ కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ వ్యాఖ్యానించారు.చేతిలో భూమి లేకుండా,నివాస స్థలాలు,ఇండ్లు లేకుండా ,ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ లపై ఆధారపడి జీవించే విదంగా నాటి నుండి నేటి వరకు దేశాన్ని,రాష్ట్రాన్ని పాలించిన, పాలిస్తున్న పార్టీలే కారణం అని దీనికి భిన్నంగా యంసిపిఐ(యు) జెండా చేతపట్టుకొని అమరజీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ నాయకత్వంలో రక్తం చిందించి అనేక బస్తీలు ఏ అధికారం లేకుండా సాధించి పెట్టారని వీటిని రక్షణకై ప్రజలంతా సంఘటితం అయి ప్రజా ఉద్యమాలు నిర్మించడమే ఏకైక మార్గం అని ఓంకార్ పిలుపునిచ్చారు.శుక్రవారం మియాపూర్ టేక్ నర్సింహ నగర్ లో తాండ్ర కుమార్ 3 వ వర్ధంతి సభను కామ్రేడ్ తుడుం అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. మొదలు మియాపూర్ చౌరస్తా లో ఉన్న కామ్రేడ్ తాండ్ర కుమార్ స్థూపానికి సిపిఐ యంయల్ ( న్యూ డెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జేవి చలపతిరావు, సిపిఐ యంయల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న,పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రదర్శనగా సభ స్థలానికి చేరుకున్నారు.ఈ మేరకు టేక్ నర్సింహనగర్ లో నిర్మాణమైన తాండ్ర కుమార్ విగ్రహంను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అశోక్ ఓంకార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో అశోక్ ఓంకార్ మాట్లాడుతూ భూమి కోసం, ఇంటి స్థలం కోసం,ఇండ్ల నిర్మాణం కోసం ప్రజా పోరాటాలకు ప్రజలు సన్నద్ధం కావాలి అన్నారు.

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన భూమి సమస్యను పరిష్కరించడానికి బదులు పేదవారి భూములను,ఇండ్ల స్థలాలు కార్పొరేట్ సంపన్న వర్గాలకు,ఫార్మా కంపెనీల పేరుతో రింగ్ రోడ్డు నిర్మాణం పేరుతో లక్షలాది ఎకరాల భూమిని ధారాదత్తం చేస్తున్నదని దీనికి వ్యతిరేకంగా తాండ్ర కుమార్ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సభలో యంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ యంయల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవి చలపతిరావు,సిపిఎం రాష్ట్ర నాయకులు డిజి నరసింహా రావు,సిపిఐ యం యల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న,ఎస్ యుసిఐ (సి) పార్టీ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి,బిఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్,గోనె కుమారస్వామి, వసుకుల మట్టయ్య,ఏ హంసా రెడ్డి, పెద్దార రమేష్ తదితరులు మాట్లాడారు.రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, వి తుకారాం నాయక్,మంద రవి రాష్ట్ర కమిటీ సభ్యులు మైదంశెట్టి రమేష్,పి భాగ్యమ్మ,పుష్ప,తాండ్ర కళావతి, మస్కుల సైదక్క, కన్నం వెంకన్న, పల్లె మురళి, పోతుగంటి కాశి,రాగ సుధా, కనకం సంధ్య, కర్రోల శ్రీనివాస్, ఏఐసిటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగ చారి,మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు కర్ర దానయ్య,ఈ దశరథ్ నాయక్, కమిటీ సభ్యులు బి.యాదగిరి, లక్ష్మణ్,రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



# 'కాలనీ ముఖద్వారానికి శంకుస్థాపన'

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ 13వ వార్డులోని స్నేహపురి కాలనీ ముఖద్వారానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. మున్సిపాలిటీలో గత కాంగ్రెస్ పాలకవర్గం అన్ని వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిందని వెల్లడించారు. మున్సిపాలిటీ అంతటా యూజీడీ, సీసీ రోడ్లు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, హరిత, బీజేపీ నాయకులు కొంద్రు పురుషోత్తం, సీనియర్ నాయకులు బొక్క రవీందర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు జి.రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.కిషన్‌సింగ్, చీఫ్ కోఆర్డినేటర్ భాస్కర్‌చారి, ఉపాధ్యక్షులు టి.బ్రహ్మయ్య, కె.రాజ్‌కుమార్, ఎ.గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీలు పి.తిరుపతయ్య, కె.అచ్యుతరెడ్డి, ట్రెజరర్ మల్లేశం, మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# బంజారాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట

- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

**కూకట్ పల్లి,విశాలభారతి:**

ఎస్ఎస్ఆర్ క్యాంప్ ఆఫీసులో తెలంగాణ గిరిజన సంఘం కూకట్పల్లి జోనల్ కమిటీ వారి ఆధ్వర్యంలో శనివారం జరిగే శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలకు కెపిహెచ్బి రమ్య గ్రౌండ్లో ఉదయం వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి కమిటీ సభ్యులతో మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందన్నారు. సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.సేవాలాల్ మహారాజ్ ఆశయా సాధన కోసం ప్రతి ఒక్క బంజారా బిడ్డలు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ఎస్టీ సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక్కగా నిలిచిందని, బంజారాలకు కాంగ్రెస్ పార్టీకి ఎంతో రుణపడి ఉంటుందని బంజారాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని శేరి సతీష్ రెడ్డి అన్నారు.



# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

**తుర్కయంజాల్, విశాలభారతి:**

సీఎం సహాయ నిధి పథకం నిరుపేదలకు ఆర్థిక భరోసానిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడకు చెందిన లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఐలయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే సదావకాశం ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్రావు, వెంకటేశ్ యాదవ్, దాసరి కృష్ణారెడ్డి, సత్యంగౌడ్, హన్మంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం'

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి'
- ఫార్మాసిటీని రద్దు చేయాలి
- సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ'

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ప్రజాసమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హామీ ప్రకారం కాంగ్రెస్ సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫోర్త్ సిటీ పేరుతో చేస్తున్న బలవంతపు భూసేకరణను వెంటనే నిలిపివేయాలన్నారు. ఫార్మాసిటీ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును రేవంత్ సర్కార్ అమలు చేయాలని సూచించారు. అలాగే గతంలో ఇంటిపట్టాలిచ్చిన రామోజీ ఫిలిం సిటీలో పేదలకు ఇళ్ల స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. కప్పపహాడ్ గ్రామంలో 98 ఎకరాల అసైన్డ్ భూమిని పేదలకు పంచాలన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలన్నారు. ఎస్సీ వర్గీకరణను తమ పార్టీ ఆహ్వానిస్తున్నదని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధి చూపించాలన్నారు. అలాగే కేంద్రప్రభుత్వం దేశవ్యాప్త కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామేల్, రామచందర్, నరసింహ, కందుకూరి జగన్, జగదీష్, జిల్లా నాయకులు జంగయ్య, అలంపల్లి నరసింహ, బుగ్గ రాములు, జగన్, బాలరాజ్, దేవేందర్, పెంటయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**కాప్రా, విశాలభారతి:**

కాప్రా మండల పరిధిలోని 38 మంది లబ్ధిదారులకు 38 లక్షల రూపాయలు కాప్రా ఎమ్మార్వో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇచ్చిన ఒక లక్ష 116 రూపాయలతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు తులం బంగారం కూడా ఇస్తే పేదింటి ఆడపిల్లలకు ఎంతో లాభం చేసినట్లు ఉంటుందని ఇకనైనా రాబోయే లబ్ధిదారులకు తులం బంగారం కూడా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల తహసిల్దార్ సుచరిత, కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అధికారుల పర్యవేక్షణలో రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణ జరగాలి

- స్వచ్ఛ ఆటోవాలాలు, కాలనీ సంక్షేమ సంఘాలు, పారిశుధ్య విభాగ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలి

**కాప్రా,విశాలభారతి:**

పరిశుభ్ర కాప్రా సర్కిల్ సాధన కోసం రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలని జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్లను చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ విజ్ఞప్తి చేసింది. రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణ తడిపొడి చెత్త తదితర విషయాలపై సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు శుక్రవారం సిసిఎస్ ప్రతినిధులు, స్వచ్ఛ ఆటో వాలాలతో కలిసి శివసాయినగర్ కు రావడం జరిగింది. ఈ సందర్భంగా చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి పారిశుధ్య విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడంతో కాప్రా సర్కిల్ వ్యాప్త కాలనీలు బస్తీలలో రోజువారిగా జరగాల్సిన ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదన్నారు. ఇకనైనా జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లు దృష్టిసారించి కాలనీ సంక్షేమ సంఘాలు స్వచ్ఛ ఆటోవాలాలు పారిశుధ్య విభాగం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా నెల వారి రుసుములను నిర్ణయిస్తే బాగుంటుందని పద్మా రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎస్ఎఫ్ఏ లక్ష్మి, కాలనీ వాసులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు కొండగళ్ల అశోక్, బర్ల రామచంద్రారెడ్డి, అశోక్, రమేష్, మంజుల, వరలక్ష్మి, వాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గుతండాలో యువకుడు అనుమానాస్పద మృతి

నర్సింహులుపేట, విశాలభారతి:



మండలంలోని జగ్గుతండ గ్రామం చింతల్ తండ లో గురువారం రాత్రి యువకుడు వివాదాస్పందమైన మృతి చెందడం జరిగింది. స్థానికులు వివరాల ప్రకారం గా యువకుడు బానోతు కృష్ణ తండ్రి పేరు మంగ్య, భార్య సుజాత,ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు ఈ మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

కూకట్ పల్లి,విశాలభారతి:

రంగారెడ్డి జిల్లా కోర్టు హాలులో న్యాయమూర్తిపై గురువారం జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ కూకట్పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి కోర్టు బార్ సోసియేషన్ ఉపాధ్యక్షులు నటరాజు, ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ గౌడ్ జాయింట్ సెక్రెటరీ యాదయ్య,కోశాధికారి ఖలీల్ పాషా,మహిళా ప్రతినిధి సదాలక్ష్మి,కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ రెడ్డి, భార్ సోసియేషన్ మాజీ అధ్యక్షులు అర్చన పెల్లి ప్రకాష్ రావు, శ్రీనివాస్ రెడ్డి, జాకీర్ హుస్సేన్ ,అఖిలేష్, సీనియర్ న్యాయవాది కేసాని సురేష్ బాబు, శేఖర్ బాబు, హర్షవర్ధన్ తోపాటు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- జలమండలి అధికారులను కోరిన కాంగ్రెస్ నాయకులు

సికింద్రాబాద్,విశాలభారతి :



సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు జియం వినోద్ కుమార్ ని కాంగ్రెస్ నాయకులు కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని మెట్టుగూడ డివిజన్ మైలారగడ్డ ప్రాంతంలో ని ఎస్వీఎస్ లైన్ కి సంబందించిన HN:111241, పరిసర ప్రాంతంలో తాగు నీరు కలిషి తమై ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడడం జరుగుతుంది అన్నారు.ఈ సమస్య చాలా రోజుల నుండి కొనసాగుతుంది అని వివరించారు.సీతాఫల్ మండి డివిజన్ పరిధిలోని అన్నానగర్ ప్రాంతంలో పద్మ కిరాణా షాప్ ఎదురుగా HNO,112426/17/A పవర్ బోర్ వెల్ రిపేర్ గురించి తీసుకొని వెళ్లి ఇప్పటి వరకు తీసుకొని రాలేదు అన్నారు. బస్తి ప్రజలకు ఇబ్బందిగా మారింది, స్ట్రీట్ నెంబర్ 1 లో వాటర్ పైప్ లైన్ ఎక్సటెన్షన్ అవసరం ఉంది, భవాని నగర్ లోని డ్రైనేజీ లైన్ 30 ఫీట్ పొడవు పెండింగ్ లో ఉందని,ఈ డ్రైనేజీ లైన్ రోడ్డు వేయడానికి సిద్దంగా ఉంది అన్నారు. ఇప్పుడు వచ్చేది ఎండా కాలం కావున ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.దూద్ బావిలోని కమ్యూనిటీ హాల్ దగ్గర పవర్ బోర్ వెల్ పని చేయడం లేదు.వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని, బ్యాంక్ అఫ్ బరోడా ప్రాంతంలో కొద్దీ ఏరియా లో పొల్యూషన్ వాటర్ రావడం జరుగుతుంది వెంటనే చర్య తీసుకొని సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమం లో సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మాది రెడ్డి, జలంధర్ రెడ్డి, పాపాలాల్, శంకర్రావు, రామాంజనేయులు, చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## యువత స్వయం ఉపాధితో పైకి రావాలి

- కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, విశాలభారతి:

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే వ్యాపార సంస్థలు లాభాల బాటలో నడుస్తాయని సీతాఫల్ మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. వారాసిగూడ ఆర్ట్స్ కాలేజీలో వెంపటి వివేకానంద ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రియల్ ఎస్టేట్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయాన్ని ఆమె స్థానిక కార్పొరేటర్ కంది శైలజ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూడకుండా యువకులు తమ సొంత వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు దేశబోయిన రఘు,హనుమకొండ సత్యనారాయణ, కట్కూరి రమేష్, అంబటి రమేష్, సతీష్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నార

## రియల్ ఎస్టేట్ వ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

- బొంగు వెంకటేష్ గౌడ్.

ఎల్బీనగర్,విశాలభారతి:



రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం లేక ఆర్థిక ఇబ్బందులతోటి గత రెండు సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని వనస్థలిపురంలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. రాష్ట్రానికి, కేంద్రానికి ఆదాయ వనరులు సమకూర్చే వ్యవస్థ ,సంస్థ రియల్ ఎస్టేట్ వ్యాపరం అని అలాంటి వ్యాపారము తెలంగాణ రాష్ట్రంలో కనుచూపుమేరలో కూడా కనపడడం లేదని బొంగు వెంకటేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది పెట్టుబడిదారులు బిల్డర్లు, ఏజెంట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కుటుంబాలు గడవక తెచ్చిన అప్పులు కట్టలేక ఈరోజు ఆర్థిక ఇబ్బందులతోటి సతమతమవుతున్నారు. ఒకవైపు ఎన్నికల కోడ్ ఎఫెక్టో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం లేదు చాలామంది ఈ వ్యవస్థను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నారు. కావున రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇబ్బందుల దృష్టి పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సతీష్ కుమార్ నుంచి స్వాధీనం చేసుకున్న నగదు.

## ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఏడిఈ సతీష్ కుమార్

- రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.

శేరిలింగంపల్లి,విశాలభారతి:



ఏసీపీకి రెడ్ హ్యాండెడ్ గా దొరికిన ఏడీఈ సతీష్ కుమార్ .

అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటూ.. అది సరిపోదన్నట్టుగా అవినీతికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా పనికి సంబంధించిన ఫైల్ మూవ్ కావాలంటే చేతులు తడపాల్సిన పరిస్థితి నెలకొంది.లంచగొండి అధికారులపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ఉద్యోగుల్లో మాత్రం మార్పు రావడం లేదు. తాజాగా గచ్చిబౌలి విద్యుత్ శాఖ ఏడీఈని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. శుక్రవారం ఏడీఈ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.ఈ సందర్భంగా గచ్చిబౌలి విద్యుత్ శాఖ ఏడీఈ సతీష్ కుమార్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.ట్రాన్స్ ఫార్మర్ మంజూరు కోసం ఏడిఈ సతీష్ కుమార్ 75 వేల రూపాయలు డిమాండ్ చేయగా వినియోగదారుల నుండి ముందే రూ.25 వేల తీసుకున్నారు.మరో రూ.50 వేలు తీసుకుంటున్న ఏడిఈ సతీష్ కుమార్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

## రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై దాడి ఘటనను ఖండించిన అడ్వకేట్ విష్ణు మంచర్ల

ఎల్బీనగర్ విశాలభారతి :



రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం కోర్టులో న్యాయమూర్తి పై దాడి ఘటనను అడ్వకేట్ మంచర్ల విష్ణువర్ధన్ మాదిగ తీవ్రంగా ఖండించారు. ఓ కేసులో కరణ్ సింగ్ అనే వ్యక్తికి రంగారెడ్డి కోర్టులో IX ఎడిజే కోర్టు న్యాయమూర్తి హరీష మహిళా జడ్జ్ అతనికి జీవిత ఖైదు శిక్ష విధించడం జరిగింది. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నిందితుడు కరణ్ సింగ్ జడ్జి పై చెప్పు విసరడం చాలా దారుణమైన సంఘటన ఈ విషయాన్ని అయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు . ఈ దేశంలో న్యాయమూర్తులకు న్యాయవాదులకు సరైన రక్షణ లేకుండా పోయింది. న్యాయం చేయడం కోసం న్యాయమూర్తులు ఉంటారు వారిపై ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం. న్యాయమూర్తులకు న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కక్షిదారుల నుంచి నేరస్తుల నుంచి రక్షణ కల్పించాలని మేము ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాం నిందితున్ని తీవ్రంగా శిక్షించాలని కోరారు. అడ్వకేట్ మంచర్ల విష్ణు మాట్లాడుతూ నేటికీ ఈ సమాజంలో నేరాలు వాటి గల శిక్షలు గురించి ప్రజల్లో ఎలాంటి అవగాహన లేదని అందుకే చాలా దారుణాలు జరుగుతున్నాయని తెలిపారు.



## కూకట్ పల్లి సిఐ రాజేష్ కి శుభాకాంక్షలు తెలిపిన కృష్ణ రాజ్ పుత్


కూకట్ పల్లి,విశాలభారతి:

కూకట్పల్లి సర్కిల్ సీఐగా నూతన పదవి బాధ్యతలు స్వీకరించిన రాజేష్ ను బాలాజీ నాగర్ సెక్టార్ ఎస్ఐ లుగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరావు,నర్సిమా కేతావత్ లను బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి సలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ కచైర్మన్ ప్రకాష్ ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వరూప గౌడ్, బండి సుధ,ఎండీ అక్బర్, శ్రీకాంత్ ముదిరాజ్,పందు ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎండీ. జంగీర్,కూకట్పల్లి యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కలికోట శంకర్, శ్రవణ్, బాలాజీనగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుల్తాన్,అంజి రెడ్డి,కాంగ్రెస్ నాయకులు శంకర నాయక్, బాలయ్య, వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

- మరమత్తుల పనులతో విద్యుత్ సరఫరా నిలిపివేత

శేరిలింగంపల్లి,విశాలభారతి:



హైదర్ నగర్ సబ్స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 11 కెవి రామ్ నరేష్ నగర్ ఫీడర్ పరిధిలోని రామకృష్ణ నగర్,హైదర్నగర్ విలేజ్, వర్టెక్స్ అపార్ట్మెంట్,శ్రీనివాస అపార్ట్మెంట్స్ లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కెవి మియాపూర్ మయూరి నగర్ సబ్స్టేషన్ పరిధిలోని మయూరి నగర్, ఓల్డ్ ఏజ్ హోమ్, ఎస్బిఐ బ్యాంకు రోడ్ విజేత సూపర్ మార్కెట్ రోడ్ లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు, మయూరి నగర్ సబ్స్టేషన్ పరిధిలో లెజెండ్ అపార్ట్మెంట్స్ మరియు నగర్ లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, గోకరాజు రంగరాజు ఫీడర్ పరిధిలో గోకరాజు రంగరాజు రోడ్ లో 2 నుంచి సాయంత్రం 5 వరకు, ప్రశాంత్ నగర్ ఫీడర్ లో మయూరి నగర్ పార్ట్, టెంపుల్ కాంప్లెక్స్,ఆర్ఎల్ సిటి రోడ్, ఓల్డ్ ఏజ్ హోమ్, ఇందిరమ్మ కాలనీ ఫేస్ టు, 11 కెవి కేంద్రీయ విహార పీటర్ పరిధిలో రత్నదీప్ బ్యాక్ సైడ్, మయూరి నగర్, ఏం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11 కెవి లక్ష్మీ నగర్ పీడర్ పరిధిలో మయూరి నగర్ సబ్స్టేషన్, లక్ష్మీ నగర్ కేంద్రీయ విహార్ రోడ్ మయూర్ నగర్ పార్ట్,రత్నదీప్ బ్యాక్ సైడ్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు, 11 కెవి రెడ్డి కాలనీ ఫీడర్ వికాస్ సబ్స్టేషన్ పరిధిలో బికే ఎంక్లేవ్ సాయి నగర్ రెడ్డి కాలనీ దగ్గర ప్రాంతాల్లో 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.



## ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై మంత్రి పొన్నం ని కలిసిన మల్ రెడ్డి రాంరెడ్డి , రామ్మోహన్ గౌడ్

ఎల్బీనగర్ ,విశాలభారతి:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి , పిసిసి మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులతో గౌరవ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ని బంజారా హిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్లో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.గత జనవరి నెల 28న జరిగిన టీజీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ 11వ రాష్ట్ర మహాసభలో ముఖ్య అతిధులుగా హాజరైన మల్ రెడ్డి రాంరెడ్డి, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు మంత్రి ని కలిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, బి.వి కోటయ్య , ప్రధాన కార్యదర్శి యస్. బుచ్చిరెడ్డి , కార్యదర్శులు బి. రామచంద్ర గౌడ్,బి యస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీష్ రావును ఆహ్వానిస్తున్న తండావాసులు.

## తీజ్ వేడుకలకు ఆహ్వానం

శేరిలింగంపల్లి,విశాలభారతి:

సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించే తీజ్ పండుగ వేడుకను మియాపూర్ నడిగడ్డ తండావాసులు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు.అందులో భాగంగా ఈ వేడుకల్లో పాల్గొనాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లను స్థానిక బిఆర్ఎస్ నాయకుడు గోపరాజు శ్రీనివాసరావ్, ఆధ్వర్యంలో నడిగడ్డ తండావాసులు ఆహ్వాన పత్రికను అందజేసి వారిని హాజరు కావాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్,రోజా కలిదిండి,వాలా హరీష్ రావు, పాల్గొన్నారు.

cinema updates

# నాకు ఆ అలవాటుంది

టాలీవుడ్ ఆడియన్స్ కు సంయుక్తా మీనన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తెలుగుతో పాటూ తమిళ, మలయాళ సినిమాతో కూడా సౌత్ లో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న సంయుక్త భీమ్లా నాయక్ సినిమాతో అందరి దృష్టిని అలరించింది. సాగర్ కే చంద్ర దర్శకత్వంలో తెలుగు ఆడియన్స్ కు పరిచయమైన ఈ భామ ప్రేక్షకుల గుండెల్లో చోటు దక్కించుకుంది. విరూపాక్ష సినిమాలో తన నటనతో అందరినీ ఆకట్టుకోవడంతో పాటూ మంచి నటిగా కూడా పేరు తెచ్చుకుంది సంయుక్త. అమ్మడు ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో తన ఫోటోలను, అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లోనే ఉంటుంది. సంయుక్తకి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగే ఉంది. తాజాగా సంయుక్త ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంయుక్త తన లైఫ్ స్టైల్ గురించి చెప్పే క్రమంలో కొన్ని సంచలన కామెంట్స్ చేసింది. తనకు ఆల్కహాల్ సేవించే అలవాటుందని, కానీ అదే పనిగా తాగనని, ఎప్పుడైనా స్ట్రెస్ ఎక్కువైనప్పుడు మాత్రమే కొంచెం తీసుకుంటానని ఎలాంటి మొహమాటాలు లేకుండా చెప్పింది. మామూలుగా హీరోయిన్లకు ఇలాంటి అలవాట్లున్నా ఎవరూ బయటకు చెప్పకోవడానికి ఇష్టపడరు. కానీ సంయుక్త మాత్రం ఎలాంటి సంకోచం లేకుండా ముక్కు సూటిగా చెప్పేసింది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పి తన ఫ్యాన్స్ ను ఆశ్చర్యపరిచిన సంయుక్త కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## అడ్వెంచర్ లవ్



టాలీవుడ్‌లో మరో విభిన్నమైన ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తెలుగు ఎంటర్టైన్మెంట్ వరల్డ్ సీనియర్ మోస్ట్ టాప్ యాంకర్ అయిన సుమ తనయుడు హీరోగా మౌగ్లీ 2025 సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఇదివరకే అతను ఒక సినిమా చేసినప్పటికి అదేమీ అంతగా సక్సెస్ కాలేదు. ఇక ఈసారి ఎలాగైనా యాక్షన్ తో హిట్ కొట్టాలని జాతీయ అవార్డు గెలుచుకున్న దర్శకుడు సందీప్ రాజ్ తో కలిశాడు. ఇక నేడు బాటిల్ ఫర్ లవ్ బిగిన్స్ పేరుతో ఓ గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ సినిమా అడ్వెంచర్, లవ్ సినిమాగా రానుంది. ఇక వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచింది. ఈ సినిమాలో రోషన్ కనకాల పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నాడు. 'బబుల్‌గమ్' సినిమాతో ఎమోషనల్ నటన చూపించిన రోషన్, ఈ సారి సరికొత్త అవతారంలో ఆకట్టుకోనున్నాడు. ఈ సినిమా ద్వారా సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది.వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే లవ్ ట్రాక్ చాలా కొత్తగా ఉండబోతుందనే టాక్ ఉంది. వాలెంటైన్స్ డే స్పెషల్‌గా మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో వేరే లెవల్‌లో ఉంది. ఓ నిశబ్దమైన అడవిలో తుపాకీ తయారుచేస్తున్న సీనుతో మొదలైన గ్లింప్స్ ఆసక్తిని రేపుతోంది. దర్శకుడు సందీప్ రాజ్ తుపాకీని సాక్షి చేతికి ఇవ్వడం, ఆమెలో కనిపించే కఠినత, ఆ తర్వాత రోషన్ ఎంట్రీతో టెన్షన్ పెరగడంతో ఈ సన్నివేశాలు సినిమాకు కొత్త హైప్ తెచ్చాయి. చివరగా షాట్ ఫైర్ అవ్వడం, ఆ వెంటనే స్క్రీన్ బ్లాక్ అవ్వడం సస్పెన్స్ క్రియేట్ చేసింది.సైలెంట్ లవ్ స్టోరీలో ఒక భీకార యుద్ధం అంటూ హింట్ అయితే ఇచ్చారు. 8 నెలల రైటింగ్, 7 నెలల ప్రీ ప్రొడక్షన్, ఆరుగురు న్యూ ఏజ్ టెక్నీషియన్స్ అంటూ టీజర్ ను కొత్తగా ప్రజెంట్ చేశారు. కేవలం వాలెంటైన్స్ డే గ్లింప్స్‌తోనే సినిమాపై క్రేజ్ పెరిగింది. రోషన్ కనకాల పర్ఫార్మెన్స్, సాక్షి ఇన్టెన్సిటీ, కాళ భైరవ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ సినిమా కేవలం రొమాన్స్‌కు పరిమితం కాకుండా, థ్రిల్, అడ్వంచర్ అంశాలతో ఆకట్టుకునేలా ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, సినిమాటోగ్రఫీకి రామ మరుతి ఎం, ఎడిటింగ్‌కు కోడాటి పవన్ కళ్యాణ్, యాక్షన్ కోసం నటరాజ్ మడిగొండ లాంటి ప్రతిభావంతులైన టెక్నీషియన్స్ పని చేస్తున్నారు.

## బ్లాక్ గౌనులో సిమ్రాన్ గ్లామర్ టచ్..

తెలుగమ్మాయి సిమ్రాన్ చౌదరి టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకుంది. 2014లో 'హమ్ తుమ్' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన సిమ్రాన్, 2017లో ఫెమినా మిస్ తెలంగాణ టైటిల్ గెలుచుకుని మోడలింగ్‌లో మంచి గుర్తింపు పొందింది. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో నటిగా తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకుంది. ఆ తరువాత 'బొంబాట్', 'చెక్', 'పాగల్', 'సెహరి', 'అథర్వ' వంటి సినిమాలలో నటించి టాలీవుడ్‌లో తన సత్తా చాటింది. అయితే, వరుసగా కొన్ని సినిమాలు ఆశించిన రీతిలో ఆడకపోవడం వలన సిమ్రాన్ కొంత స్లో అయ్యింది. అయినా, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో గ్లామర్ ఫోటోషూట్లతో ఎప్పటికప్పుడు తన క్రేజ్‌ను పెంచుకుంటూ వెళ్తోంది. తాజాగా, వాలెంటైన్స్ డే స్పెషల్‌గా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో సిమ్రాన్ బ్లాక్ బాక్‌లెస్ గౌన్‌లో స్టన్నింగ్ లుక్స్‌లో కనిపించింది. హాయిగా కురిసిన కురులు, క్యూట్ స్మైల్‌తో ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. "ప్రేమించే సామర్థ్యం మీకు ఉంటే, ముందుగా మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి" అనే చార్లెస్ బుకోవ్స్కి కోటేషన్‌తో ఈ ఫోటోలకు మరింత డెప్త్ తీసుకువచ్చింది. ఈ స్టిల్స్‌లో ఆమె నేచురల్ గ్లో, కళ్లలో కనిపించే ఆకర్షణ నెటిజన్లను ఫిదా చేసింది.ఫ్యాన్స్ కామెంట్స్‌లో, "బ్లాక్ గౌన్‌లో బ్యూటిఫుల్ సిమ్రాన్", "క్యూట్ అండ్ క్లాసీ లుక్" అంటూ పొగడ్తలతో కామెంట్స్ విరివిగా చేస్తున్నారు. కొందరు ఈ స్టిల్స్‌ను చూసి "బ్లాక్‌లో ఏంజెల్" అని కామెంట్ చేస్తున్నారు. ఆమె తన ఫోటోషూట్స్ ద్వారా ఎప్పుడు గ్లామర్ డోస్ చూపించడంలో సక్సెస్ అవుతుంది. ప్రస్తుతం సిమ్రాన్ తెలుగు తమిళ సినిమాల కోసం చర్చలు జరుపుతుందనే వార్తలు ఉన్నాయి. సోషల్ మీడియాలో తన ప్రెజెన్స్‌ను పెంచుకుంటూ, మళ్ళీ బిగ్ ప్రాజెక్ట్స్ తో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆమె ప్రయత్నం చేస్తోంది.



## పావని స్టన్నింగ్ లుక్



పావని కరణం .. ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పేరు. తెలుగు ఫిలింసర్కిల్స్ లోను ఈ తెలుగమ్మాయి ప్రతిభ గురించి చర్చ సాగుతోంది. పుష్ప 1, పుష్ప 2 చిత్రాల్లో నటించిన పావని కరణం ఎంపిక చేసిన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. అసలు ఇంటి పేరుతో ఒక ఐడెంటిటీ లేని పుష్పరాజ్ కి అన్న కూతురు కావేరిగా పావని నటించింది. అంతేకాదు సొంత అన్నయ్య అజయ్.. పుష్పరాజ్ ని అవమానిస్తుంటే, చివరికి అతడిని అన్ని అవమానాల నుంచి బయటపడేసే కీలక పాత్రలో పావని కనిపించింది. పుష్ప 2 క్లైమాక్స్ ని అర్థవంతంగా ముగించేందుకు సుకుమార్ ఎంతో తెలివిగా అజయ్ కుమార్తె పాత్రను ఉపయోగించుకున్నారు. ఆ పాత్రలో అద్భుతంగా నటించింది పావని.ఇక పావని పదహారణాల పల్లెటూరి తెలుగమ్మాయి ఎలా ఉంటుందో అలాగే తెరపై చీరల్లో మురిపించింది. క్లైమాక్స్ లో పావనిని అడ్డు పెట్టుకుని పుష్పరాజ్ పై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్న రౌడీలకు జీవితంలో మర్చిపోలేని విధంగా ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి. మొత్తానికి పావనికి సుకుమార్ కీలక పాత్రలో ఆఫర్ ఇవ్వడంతో ఆ ఎమోషన్ ని తను ఎప్పటికీ దాచుకోలేకపోతోంది. ఇంతకుముందు ఒక వేదికపై కన్నీటిపర్యంతం అవుతూ సుక్కూ అండ్ బన్నీకి థాంక్స్ చెప్పింది కూడా. పావని తెలుగు ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న నటి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.